సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



మెట్టినింటికి జములమ్మ

జములమ్మ పుట్టినిల్లు గుర్రంగడ్డ నుంచి మెట్టినిల్లు జమ్మిచేడుకు చేరుకుంది.

వివరాలు 8లో ▸



వైభవంగా శకటోత్సవం..

గంగాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి శకటోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 34.0 /14.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం, రాత్రివేళ చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ రద్దు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్, పారామెడికల్, స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీ కోసం గతేడాది నవంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, పారామెడికల్ అసిస్టెంట్ పోస్టులను చెంచు సామాజిక వర్గాలకు చెందిన వారితో మాత్రమే భర్తీ చేయాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నుంచి ఆదేశాలు జారీ కావడంతో, గత రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో సమర్పించిన డీడీలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తిరిగి తీసుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

కేంద్ర బడ్జెట్ సవరించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ ప్రజావ్యతిరేకమని.. ఈ బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ దేశాభివృద్ధి తిరోగమనానికి అద్దం పట్టేలా ఉందన్నారు. వ్యవసాయ రంగానికి రూ. 10వేల కోట్లు తగ్గించడంతో పాటు.. యూరియా, కాంప్లెక్స్ ఎరువులపై ఇస్తున్న సబ్సిడీలను తగ్గించారన్నారు. రైతాంగానికి ఎరువుల ధరలు భారమై వ్యవసాయ రంగం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఆహార భద్రత పథకానికి కూడా నిధులు తగ్గించారన్నారు. కార్మిక సంక్షేమ ఊసే లేదని ఆరోపించారు. ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు ఎం.శ్రీనివాసులు, బాల్‌రెడ్డి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సీఐటీయూ నాయకులు వర్దం పర్వతాలు, రామయ్య, కొంపల్లి అశోక్, ఈశ్వర్, మల్లేష్, దశరథం, లక్ష్మణ్, బాలస్వామి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్



కందనూలు: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం జిల్లావ్యాప్తంగా 43 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.. 939 మంది విద్యార్థులకుగాను 892 మంది హాజరయ్యారు. కల్వకుర్తిలోని న్యూఏరా బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని డీఐఈఓ వెంకటరమణ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు.

ఆముదం సాగుతో అధిక లాభాలు



వంగూరు: ఆముదం సాగుతో రైతులకు అధిక లాభాలు ఉంటాయని పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు నళిని, ఈశ్వర్‌రెడ్డి, దివ్యరాణి అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లిలో రైతులు రవికిరణ్‌రెడ్డి, రాములు సాగు చేసిన ఆముదం పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆముదం పంట పండించే రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు పంటలు పండించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, ఏఓ ప్రియదర్శిని, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ @ రూ.6,419

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు బుధవారం వివిధ ప్రాంతాల నుంచి 194 మంది రైతులు 2,332 క్వింటాళ్ల వేరుశనగను అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,419, కనిష్టంగా రూ.4,001, సరాసరి రూ.5,850 ధరలు వచ్చాయి.

పరిహాసం..

ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల విస్తరణ కోసం భూసేకరణ

- ఉమామహేశ్వర, మల్లమ్మకుంట రిజర్వాయర్ సర్వే పనులను అడ్డుకున్న అన్నదాతలు
- జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతుల ఆత్మహత్యాయత్నం
- సరైన పరిహారం చెల్లించాలని భూనిర్వాసితుల ఆందోళన



ఉమామహేశ్వర రిజర్వాయర్ వద్దంటూ ఆందోళన చేస్తున్న బల్మూర్ గ్రామస్తులు (ఫైల్)

సాక్షి, నాగర్‌కర్నూల్: సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాల్లో భూములను కోల్పోయే నిర్వాసితుల బాధలు వర్ణనాతీతం. భూములు, జీవనోపాధి, గూడు సర్వం కోల్పోయే వారి త్యాగాలతోనే పెద్దసంఖ్యలో ప్రజలకు సాగునీరు, రవాణా సౌకర్యాలకు అందుబాటులోకి వస్తాయి. అయితే అసంపూర్తిగా పరిహారం చెల్లించడం, బహిరంగ మార్కెట్లో రూ.కోట్లలో పలికే భూములున్నా, తక్కువే నష్ట పరిహారం దక్కుతుండటం, పరిహారానికి ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి రావడం పరిపాటిగా మారుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాలమూరు-రంగారెడ్డి, నారాయణపేట-కొడంగల్, ఆర్డీఎస్-మల్లమ్మకుంట రిజర్వాయర్, ఉమామహేశ్వర ఎత్తిపోతల తదితర సాగునీటి ప్రాజెక్టులతో పాటు కల్వకుర్తి-నంద్యాల, జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారుల విస్తరణ పనుల కోసం పెద్ద ఎత్తున భూసేకరణ పనులు కొనసాగుతున్నాయి. భూసేకరణ సమయంలో అధికారుల సర్వేలను అడ్డుకుంటూ నిర్వాసితులు నిరసనలు చేస్తున్న ఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి.

నిర్వాసితులకు దక్కేది అరకొరే..

వాస్తవానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎకరం భూమి కనీసం రూ. 30 లక్షలు పలుకుతుండగా, ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు దక్కేది నామమాత్రమే. 2013 భూసేకరణ చట్టం కింద ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుండగా, భూములకు వాస్తవంగా రిజిస్ట్రేషన్ విలువను బట్టి మూడింతల పరిహారం దక్కుతోంది. చాలాప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువ ఎకరాకు రూ.4 లక్షలు మించి లేదు. ఈ క్రమంలో మండల కేంద్రాలు, గ్రామాల్లోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న భూములు సైతం ఎకరం రూ.13 లక్షలకు మించి అందడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమకు జీవనోపాధి కల్పించాలని కోరుతున్నారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం..

కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారి 167కే నిర్మాణం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలకేంద్రం వద్ద బైపాస్ నిర్మాణ పనుల్లో భాగంగా సర్వే పనులు సాగుతున్నాయి. భూసేకరణ కోసం వెళ్లిన అధికారులను ఈ నెల 1న రైతులు అడ్డుకున్నారు. అధికారులకు, భూనిర్వాసితులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే నిర్వాసిత రైతులు శేఖర్ పురుగు మందు తాగగా, మరో రైతు కురుమూర్తి ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం సంచలనమైంది. అచ్చంపేట నియోజకవర్గంలో సాగునీరు అందించేందుకు చేపడుతున్న ఉమామహేశ్వర ఎత్తిపోతల పథకం, రిజర్వాయర్ పనుల సర్వేను సైతం ఇటీవల రైతులు అడ్డుకున్నారు. బల్మూర్, అచ్చంపేట మండలాల్లోని రైతులు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు.

మల్లమ్మకుంట కోసం 568 ఎకరాలు..

తుంగభద్రత నదిపై తుమ్మిళ్ల లిఫ్ట్‌తో పాటు ఆర్డీఎస్ పరిధిలోని చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు ప్రభుత్వం మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం చేపడుతోంది. మల్లమ్మకుంట రిజర్వాయర్ కోసం మొత్తం 568 ఎకరాలు అవసరం ఉండగా.. భూసేకరణ కోసం అధికారులు చేపట్టిన సర్వే పనులను రైతులు అడ్డుకుంటున్నారు. భూములు కోల్పోతున్న రైతులకు సరైన పరిహారం అందించాలని, లేదంటే కోల్పోయే భూములకు బదులుగా వేరే ఎక్కడైనా భూమిని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

రహదారి పనులకు అడ్డంకులు..

జాతీయ రహదారుల నిర్మాణానికి పరిహారం విషయంలో నిర్వాసితుల నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. తమకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించాకే నిర్మాణపనులు మొదలుపెట్టాలని నిర్వాసితులు కోరుతున్నారు. మంగళవారం జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై ఉన్న చారకొండ బైపాస్ కోసం అధికారులు పోలీస్ బందోబస్తు నడుమ నిర్వాసితుల ఇళ్లను కూల్చివేశారు. సుమారు 150 మంది పోలీసులు, రెవెన్యూ అధికారులు కలసి ఒకే రోజున మొత్తం 29 ఇళ్లను జేసీబీలతో నేలమట్టం చేశారు. జాప్యం లేకుండా సకాలంలో పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని నిర్వాసితులు వాపోతున్నారు.



చారకొండలో నిర్వాసితురాలిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు (ఫైల్)

ఎవరూ లేనప్పుడు మా ఇల్లు కూల్చారు..



జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిలో చారకొండ బైపాస్ నిర్మాణ పనుల కోసం అధికారులు మా ఇంటిని కూల్చివేశారు. ఆ సమయంలో మేం అందుబాటులో లేకున్నా, కనీస సమాచారం ఇవ్వకుండా మా ఇంటిని నేలమట్టం చేయడం అన్యాయం. మొత్తం 262 గజాల విస్తీర్ణంలో ఇల్లు ఉండగా, కేవలం 215 గజాలకే పరిహారం ఇచ్చారు. ఇంటి నిర్మాణ ఖర్చులు కలుపుకొని న్యాయమైన పరిహారం అందించాలి.

– నూనె విష్ణు, మర్రిపల్లి, చారకొండ మండలం

పూర్తి పరిహారం ఇవ్వకుండానే..



చారకొండ బైపాస్ కోసం మా ఇంటిని కూల్చివేశారు. మొత్తం 160 గజాల ఇంటికి కేవలం 100 గజాలకే పరిహారం చెల్లించారు. మా కళ్ల ముందే ఇంటిని కూల్చేసి, మా బాధలను మాత్రం పట్టించుకుంటలేరు. కోల్పోయిన ఇంటికి పరిహారం బదులుగా ఇల్లు నిర్మించి ఇవ్వాలి.

– గుండె అనసూయ, చారకొండ

వేరే చోట ఎకరం భూమి ఇవ్వాలి..



మల్లమ్మకుంట రిజర్వాయర్‌లో మా కుటుంబానికి చెందిన 14 ఎకరాలు భూసేకరణ కోసం తీసుకుంటున్నారు. మా ఒక్క గ్రామంలోనే మొత్తం 500 ఎకరాలకు పైగా భూమి రిజర్వాయర్‌లో పోతుంది. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలి. ఎకరాకు బదులుగా వేరోచోట ఎకరం భూమి ఇవ్వాలి, లేదా ఎకరాకు కనీసం రూ.35 లక్షల పరిహారం ఇవ్వాలి.

– గట్టన్న, రైతు, తనగల, వడ్డేపల్లి మండలం, జోగుళాంబ గద్వాల జిల్లా

జీవనాధారం కోల్పోతున్నాం..



ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణం కోసం మా కుటుంబానికి చెందిన మొత్తం 14 ఎకరాల భూమి ప్రాజెక్ట్‌లో ముంపునకు గురవుతుంది. తాతల కాలం నుంచి ఈ భూమినే నమ్ముకుని బతుకుతున్నాం. ఇప్పుడు భూమిని కోల్పోతే మాకు జీవనాధారం లేదు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం రూ.10 లక్షలు కూడా దాటడం లేదు. మాకు వేరేచోట భూమి ఇచ్చి ఆదుకోవాలి.

– తిరుపతయ్య, భూనిర్వాసితుడు, బల్మూర్, నాగర్‌కర్నూల్ జిల్లా

చట్టప్రకారం పరిహారం చెల్లిస్తాం..

సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం కోసం ఎప్పటికప్పుడు భూసేకరణ పనులు కొనసాగుతున్నాయి. చాలావరకు పూర్తి కావచ్చాయి. ప్రాజెక్టుల భూసేకరణపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. భూనిర్వాసితులకు చట్టప్రకారం న్యాయమైన పరిహారాన్ని అందిస్తున్నాం. సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– అమరేందర్, అడిషనల్ కలెక్టర్, నాగర్‌కర్నూల్

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



అచ్చంపేట: వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో లోఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొత్త సబ్‌స్టేషన్ల పనులకు శంకుస్థాపన చేయాల్సి ఉండగా.. ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క రాకకు సమయం లభించని కారణంగా వాయిదా పడిందన్నారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు సైతం విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న సబ్‌స్టేషన్ల పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కొత్త సబ్‌స్టేషన్లు ఎక్కడెక్కడ నిర్మించాలనే దానిపై ఇప్పటికే స్పష్టత వచ్చిందని.. అందుకు అవసరమైన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



వంగూరు/ఉప్పునుంతల: చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈఓ రమేష్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం వంగూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో డీఈఓ సమావేశమై మాట్లాడారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ.. వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. అనంతరం వంగూరు మండలంలోని డిండిచింతపల్లి, నిజాంబాద్, ఉప్పునుంతల మండలం ఫిరట్వానిపల్లి పాఠశాలలను డీఈఓ తనిఖీ చేశారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేద్దాం




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఇతర అధికారులు

- ఆదివాసీ చెంచుల జీవన ప్రమాణాలను పెంపొందించాలి
- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి కార్యక్రమం (టీజీఐఎల్‌పీ)పై బుధవారం కలెక్టర్, డీఆర్డీఓలతో తెలంగాణ సెర్ప్ సీఈఓ దివ్య వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. జిల్లాలోని అమ్రాబాద్, పదర మండలాలను టీజీఐఎల్‌పీ కింద గుర్తించినట్లు తెలిపారు. నల్లమల అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసీ చెంచుల సుస్థిర జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అత్యంత నిరుపేదలైన కుటుంబాలకు తప్పనిసరిగా ఆధార్, రేషన్ కార్డు, విద్య, వైద్యం, బ్యాంకింగ్ సదుపాయాలను కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అందుకుగాను ప్రతి మండలానికి ఒక కోఆర్డినేటర్‌ను నియమించాలని తెలిపారు. వారి ద్వారా అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తించి.. జీవన విధానం మెరుగుపరచడానికి అవసరమైన సంక్షేమ పథకాలు అందించాలన్నారు. అదే విధంగా తాగునీరు, సోలార్ విద్యుత్, రహదారులు, అంగన్‌వాడీ, పాఠశాలలు లాంటి సదుపాయాలు కల్పించడంతో పాటు స్థిర వ్యాపారం చేసుకోవడానికి బ్యాంకుల ద్వారా ఆర్థిక సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, భూమి, ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. మహిళా సంఘాల ద్వారా సుస్థిరమైన ఆదాయ వనరులు కల్పించాలని తెలిపారు. వీసీలో డీఆర్డీఓ చిన్న ఓబులేషు, కోఆర్డినేటర్ అంజయ్య, డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి, డీడబ్ల్యూఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డా.స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డా.స్వరాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. మాతాశిశు సంరక్షణ సేవలతో పాటు గర్భిణులు, శిశువుల టీకాకరణ, అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న వందరోజుల నిక్షయ్ శిబిరానికి ఆశావర్కర్ల ద్వారా క్షయ అనుమానితులను తరలించి, నిర్ధారణ పరీక్షలు చేయించాలని సూచించారు. వ్యాధిగ్రస్తులందరికీ మెరుగైన చికిత్స అందించాలన్నారు. అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా క్రమం తప్పకుండా మందులు అందజేసి, ఆరోగ్యవంతమైన జీవనశైలి అలవర్చుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పు చేయించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.వెంకటదాస్, డా. భీమా నాయక్, ప్రోగ్రాం అధికారులు డా.రవికుమార్, డా. కృష్ణ మనోహర్, డా.ప్రదీప్ తదితరులు ఉన్నారు.

రూ.కోట్లు దోచేశాడు..!

కేటుగాడు ముజామిల్ లీలలెన్నో..

- స్వయంగా లాభం పొందినట్టుగా ప్రజలను నమ్మించిన వైనం
- రియల్ ఎస్టేట్, క్రిప్టో కరెన్సీలలో పెట్టుబడులు పెట్టి నష్టాల బాటలోకి..
- కేటుగాడి అరెస్టుతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంటున్న బాధితులు



పోలీస్‌స్టేషన్ ఎదుట ముజామిల్ బాధితులు

కల్వకుర్తి: రియల్ ఎస్టేట్‌లో తాను స్వయంగా పెట్టుబడులు పెట్టి లాభాలు గడించినట్టు అందరికీ చెప్పాడు.. అంతే కాకుండా ప్రజలను నేరుగా వెంచర్ల వద్దకు తీసుకెళ్లాడు. పెట్టుబడులు పెట్టిన కొందరికి లాభాలు చూపాడు.. ఇలా రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తున్నాయని అందరినీ నమ్మించడంతో అధిక మొత్తంలో డబ్బులను అతడికి అందించారు. చివరకు రూ. 100 కోట్లకు పైగా కొల్లగొట్టి.. పెట్టుబడులు పెట్టిన వారందరికీ దోకా ఇచ్చాడు కల్వకుర్తి పట్టణానికి చెందిన ముజామిల్. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన ముజామిల్ కొన్నేళ్లుగా ప్రార్థనా మందిరాల్లో అందరితో పరిచయాలు పెంచుకున్నాడు. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెడితే అధిక డబ్బులు వస్తాయని నమ్మించి, అందరితో పెట్టుబడులు పెట్టించాడు. కొన్ని రోజుల వరకు లాభాలు బాగానే వచ్చాయి. క్రమేణా లాభాలు రాకపోగా.. అసలు పెట్టుబడి డబ్బు వస్తుందో రాదో తెలియని స్థితికి బాధితులు చేరుకున్నారు. గతేడాది జూలైలో ముజామిల్ పూర్తిగా చేతులెత్తేయడంతో లబోదిబోమంటున్నారు. చివరకు ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు.. మంగళవారం అతడిని పట్టుకుని జైలుకు పంపారు.

వ్యాపారంగా మార్చుకొని..

రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల పేరుతో ముజామిల్ 2020లో స్వయంగా వ్యాపారాన్ని ప్రారంభించాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఎండీ రాంరెడ్డి, రాజేష్ ఖన్నా, మోహన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, టీచర్ శ్రీనివాసులుతో కలిసి రూ. కోట్లు పెట్టుబడుల రూపంలో ప్రజల నుంచి వసూలు చేశారు. మరోవైపు జంగం శ్యాంసుందర్ అనే వ్యక్తితో కలిసి చైన్ సిస్టం వ్యాపారాన్ని నిర్వహించారు. ఏజెంట్లకు కార్లు, బైక్‌లు, బంగారం నాణేలు, ఇతర బహుమతులను ఆశగా చూపడంతో భారీగా పెట్టుబడులు పెట్టించారు. అయితే వీరంతా పెట్టుబడిదారులకు కొన్ని రోజులు మంచిగానే లాభాలు ఆర్జించి పెట్టినా.. చివరకు మొహాలను చాటేశారు.



రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి సొమ్ముతో ముజామిల్ (ఫైల్)

ట్రేడింగ్‌లోకి భారీగా..

రియల్ ఎస్టేట్‌లో మోసపోయిన ముజామిల్.. స్టాక్ మార్కెట్ ట్రేడర్ ప్రసన్నం కార్తీక్‌తో పరిచయం ఏర్పర్చుకున్నాడు. ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బులను పెద్ద మొత్తంలో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లోకి మళ్లించాడు. అయితే 2023 ఆగస్టులో ట్రేడర్ అకస్మాత్తుగా మరణించాడు. ట్రేడింగ్‌లో ఓనమాలు తెలియని ముజామిల్.. క్రిప్టో కరెన్సీతో పాటు చైన్ సిస్టం మార్కెట్‌లో భారీగా పెట్టుబడులు పెట్టి నష్టపోయ్యాడు. చివరకు తనను నమ్మి పెట్టుబడులు పెట్టిన ప్రజలను నట్టేట ముంచాడు.

బంగారం, భూములు అమ్మి..

కేటుగాడి మాయలో పడిన ప్రజలు ముందూ వెనక ఆలోచించకుండా పెట్టుబడులు పెట్టారు. వారికి ఉన్న భూములు, ప్లాట్లు, బంగారం, ఇతర ఆస్తులను అమ్ముకున్నారు. వారితో పాటు తమ బంధువులు, స్నేహితులతో కూడా పెట్టుబడులు పెట్టించారు. కొందరు మహిళలు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండానే బంగారాన్ని అమ్మి పెట్టుబడులు పెట్టినట్టు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.

పోలీస్‌స్టేషన్‌కు బాధితులు..

ముజామిల్‌ను పోలీసులు అరెస్టు చేశారని తెలుసుకున్న బాధితులు స్టేషన్‌కు క్యూ కట్టారు. బాధితులంతా ఒక్కసారిగా తరలిరావడంతో పోలీస్‌స్టేషన్ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. జనం ఎక్కువగా వస్తుండటాన్ని గమనించిన పోలీసులు.. వారందరినీ అక్కడి నుంచి పంపించేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ బాధితులు అక్కడి నుంచి కదలలేదు. చివరకు పోలీసులు ముజామిల్‌ను రిమాండ్‌కు తరలించేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది.

భూమి అమ్మాను..



పెట్టుబడులు పెడితే డబ్బులు రెండింతలు వస్తాయని చెప్పడంతో భూమిని అమ్మాను. కొద్ది రోజులు నమ్మకంగా డబ్బులు ఇచ్చిన ముజామిల్.. చివరకు చేతులెత్తేశాడు. నాతో పాటు నా కుమార్తెలు, ఇతర బంధువులు పెట్టుబడులు పెట్టారు. చివరకు ఇదంతా ఫ్రాడ్ అని తెలుసుకునే వరకు అతడు కనిపించకుండా పోయాడు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేసి మాలాంటి సామాన్య ప్రజలకు న్యాయం చేయాలి.

– జంగమ్మ, బాధితురాలు, కల్వకుర్తి

బాధితులు ఫిర్యాదు చేయవచ్చు..

పెట్టుబడుల పేరుతో ముజామిల్‌కు డబ్బులు ఇచ్చిన వారంతా నిర్భయంగా కల్వకుర్తి సీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకు సంబంధించి విచారణ కొనసాగుతుంది. అతడిని కస్టడీకి తీసుకుని పూర్తి విచారణ నివేదికను కోర్టులో సమర్పిస్తాం. మరింత లోతైన విచారణకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ, కల్వకుర్తి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

● రామాపురంలో విషాదఛాయలు


కృష్ణ (ఫైల్)

శాంతినగర్: పొట్టకూటికోసం శ్రీశైలంలో కరెంట్ పనికోసం వెళ్లిన యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. దీంతో వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రామాపురం గ్రామానికి చెందిన కృష్ణ (కిట్టు) (28) ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగా కరెంట్ స్తంభాల విస్తరణ పనులు చేపడుతున్నారు. కరెంట్ పోల్ ఎక్కి విద్యుత్ లైన్‌లు సరిచేస్తుండగా కృష్ణ విద్యుదాఘాతానికి గురయ్యాడు. హుటాహుటిన దేవస్థానం ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరణించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. కృష్ణకు భార్య పావని (మంజుల), కూతురు చైత్ర, నెల రోజుల బాబు ఉన్నారు. నిరుపేద కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కాంట్రాక్టర్ ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనం, లారీ ఢీ: ఒకరి దుర్మరణం


నర్సింహారెడ్డి (ఫైల్)

కొత్తకోట రూరల్: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం రేమొద్దుల గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి(55) విలియంకొండలో ఉన్న తన చెల్లెలు వ్రతం చేస్తుండడంతో వచ్చాడు. తిరిగి ఊరికి వెళ్తుండగా కొత్తకోట మదర్ థెరిస్సా జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకునేలోపు హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. వెంటనే చుట్టుపక్కల వారు 108కు సమాచారం అందించడంతో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని భార్య అరుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం


భాగయ్య (ఫైల్)

బిజినేపల్లి: కడుపు నొప్పి భరించలేక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన గంగనమోని భాగయ్య (58) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం కడుపు నొప్పి తీవ్రంగా రావడంతో సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీన్ని గమనించిన స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య అమృతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భాగయ్యకు కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాపూర్ (బాలానగర్): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాలానగర్ ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ తెలిపిన వివరాలు.. హేమాజీపూర్ పంచాయతీ పరిధిలో గాంధీపాలెంకు చెందిన సుబ్యా(65) మంగళవారం సాయంత్రం గాంధీ పాలెం నుంచి హేమాజీపూర్‌కు నడుచుకుంటు వెళ్తున్నాడు. వెనుక నుంచి ఓ మోటార్‌సైకిల్ వచ్చి ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం షాదనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి కుమారుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

అయిజ: వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే నెపంతో ఓ యువకుడిని మరో వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస చారి వివరాల ప్రకారం.. అయిజ పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో నర్సప్ప గుడి పక్కన నివాసముంటున్న మాస్‌ను ఆయన నివాసంలో అదే కాలనీలో నివాసముంటున్న గూడు బాషా బుధవారం కత్తితో దాడి చేశాడు. మాస్‌కు కడుపులో, ఎడుమ చేతికి కత్తి కుచ్చుకోవడంతో గాయాలయ్యాయి. అరుపులు వినిపించడంతో చుట్టుపక్కల వారు గుమిగూడారు. దీంతో గూడుబాషా పారిపోయాడు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. బాధితుడు గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గూడుబాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివాహేతర సంబంధమే ఈ సంఘటనకు కారణమని పోలీసులు తెలిపారు.

మెట్టినింటికి చేరుకున్న జములమ్మ

● అమ్మవారికి అడుగడుగునా ఘన పూజలు


జములమ్మ అమ్మవారిని మెట్టినింటికి తీసుకొస్తున్న అర్చకులు

గద్వాల న్యూటౌన్: నడిగడ్డ ప్రజల ఆరాధ్య దైవం జములమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం రెండోరోజు అమ్మవారు పుట్టినిల్లు గుర్రంగడ్డ నుంచి ఎద్దులబండిపై మెట్టినిల్లు అయిన జమ్మిచేడుకు పరుశరామస్వామి ఆలయ పూజారులు తీసుకొచ్చారు. సంప్రదాయబద్ధంగా నాగపడిగను ఎద్దులబండిలో ఉంచి విశేష పూజలు చేస్తూ అమ్మవారిని గుర్రంగడ్డ నుంచి మేళతాళాలు, డప్పుల మోతలు, కుర్వడోలు చప్పుళ్లతో జమ్మిచేడులోని ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు అడుగడుగునా అమ్మవారికి పూజలు చేశారు. ఎద్దులబండి ఆలయానికి చేరుకోగానే అర్చకులు, పాలకవర్గ సభ్యులు, అధికారులు సంప్రదాయరీతిలో అమ్మవారికి స్వాగతం పలికారు. పూజారులు నాగపడిగను అమ్మవారి విగ్రహానికి ధరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈఓ పురేందర్‌కుమార్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


అమ్మవారికి స్వాగతం పలుకుతున్న భక్తులు

వైభవంగా శకటోత్సవం

● నేటితో ముగియనున్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


ఎద్దులబండ్ల ఊరేగింపు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్సవానికి హాజరైన భక్తులు బుధవారం స్వామివారిని దర్శించుకొని స్వగ్రామాలకు బయలుదేరారు. బుధవారం సైతం వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించగా.. మరికొందరు సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అలాగే సాయంత్రం శకటోత్సవం అత్యంత కోలాహలంగా సాగింది. రైతులు, భక్తులు ఎద్దులబండ్లు, ట్రాక్టర్లను అందంగా స్వామివారి భారీ కటౌట్లు, రంగురంగుల కాగితాలు, కొబ్బరి, అరటి ఆకులతో అలంకరించి గ్రామవీధుల్లో ఊరేగించారు. ఆలయ రాజగోపురం వద్ద ట్రాక్టర్లు, ఎద్దులబండ్లను మెట్లపైకి ఎక్కించే ప్రయత్నం చేశారు. శివసత్తుల పూనకాలు, సంప్రదాయ మేళతాళాలతో శకటోత్సవం సాగింది. శకటోత్సవంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం పూర్ణాహుతి, చక్రస్నానంతో ఉత్సవాలు ముగియనున్నాయి. మరో నాలుగు రోజుల పాటు భక్తుల రద్దీ ఉంటుంది.


రాజగోపురం వద్ద మెట్లపైకి ట్రాక్టర్


పోతురాజుల విన్యాసాలు

అట్టహాసంగా..



ఆకట్టుకున్న విద్యార్థుల గిరిజన నృత్య ప్రదర్శన

● 'సుద్దాల' సాంస్కృతికోత్సవాలు ప్రారంభం
● నృత్యాలతో యువత, విద్యార్థుల సందడి
● పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం, నమీబియా దేశ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి బెర్నాల్డ్



స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సుద్దాల హనుమంతు సాంస్కృతికోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాల్లో జానపద నృత్యం, చిత్రలేఖనం, కోలాటం, శాస్త్రీయ నృత్యం, లఘునాటికలు నిర్వహించారు. సంప్రదాయ, జానపద నృత్యాలతో విద్యార్థులు, యువత సందడి చేశారు. మైదానంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికల వద్ద ఆయా అంశాల్లో పోటీలు నిర్వహించారు. ప్రకృతి అంశాలపై కోలాటం ప్రదర్శన అలరించింది. సీనియర్ విభాగంలో లింగవివక్ష, జూనియర్‌లో 'జాతీయ సమైక్యత భిన్నత్వంలో ఏకత్వం'పై చిత్రకారులు అద్భుతమైన చిత్రాలను చిత్రీకరించారు. ఉత్సవాలు గురువారం ముగియనున్నాయి. గెలుపొందిన వారికి ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ బహుమతులు అందజేయనున్నారు.

కష్టజీవుల కోసం జీవితం..

కవిగా, కళాకారుడిగా, వాగ్గేయకారుడిగా సుద్దాల హనుమంతు తన జీవితాన్ని కష్టజీవుల కోసం అంకితం చేశారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆనాడు సాయుధ పోరాటంలో సుద్దాల రాసిన 'పల్లెటూరి పిల్లగాడ పసులగాసే' పాట ఎందరినో ప్రభావితం చేసిందన్నారు. నమీబియా దేశ ఆరోగ్యశాఖ మాజీమంత్రి బెర్నాల్డ్ హౌఫిక్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కళల్లో రాణిస్తుండడం సంతోషమని అన్నారు. ఈ ఉత్సవాలు తనకెంతో ప్రత్యేకంగా అనిపించాయని అన్నారు. టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ఉత్సవాల కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, అధ్యక్షులు బెక్కం జనార్దన్, ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, పిల్లలమర్రి బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు డా.ప్రతిభ, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డాక్టర్ రాంమోహన్ పాల్గొన్నారు.



ఉత్సవాల్లో సుద్దాల హనుమంతు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, నమీబియా దేశ మాజీ ఆరోగ్యశాఖ మంత్రి బెర్నాల్డ్ హౌఫిక్

పీయూ అధ్యాపకుడికి పేటెంట్


అధ్యాపకుడు మధును అభినందిస్తున్న పీయూ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ గణిత విభాగ అధ్యాపకుడు మధుకు రోలర్ స్టాంప్ పరికరానికి సంబంధించి డిజైన్ విభాగంలో పేటెంట్ లభించింది. ఈ సందర్భంగా బుధవారం ఆయనను పీయూ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ అభినందించి మాట్లాడారు. రోలర్ స్టాంప్ పరికరం ఒక అద్భుత ఆవిష్కరణ అని.. దీంతో పిల్లలు సంఖ్యలను గుర్తించడం సులభంగా ఉంటుందన్నారు. ఈ పరికరం ద్వారా చతుర్విధ ప్రక్రియలు చేయడం సులువని తెలిపారు. నాగరాజు, రవీందర్‌రెడ్డి, అర్జున్‌కుమార్, భూమయ్య, రవికుమార్, కరుణాకర్ రెడ్డి, చంద్రకిరణ్, రాంమోహన్ పాల్గొన్నారు.

బావిలో పడి బాలుడు మృతి


విచారిస్తున్న అమరచింత పోలీసులు

అమరచింత/ చిన్నచింతకుంట: మేకలను మేపడానికి వెళ్లిన బాలుడు బావిలో పడి మృతి చెందిన సంఘటన బుధవారం అమరచింత మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చిన్నచింతకుంట మండలంలోని మద్దూరుకు చెందిన నాగరాజు, పద్మమ్మల కుమారుడు కురుమూర్తి(15) బుధవారం మేకల మందను తీసుకొని వెళ్లాడు. వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని చంద్రనాయక్‌తండా శివారులో మేకల మందను ఆపుకున్నాడు. అక్కడే ఉన్న వ్యవసాయ బావిలో మధ్యాహ్నం స్నానం కోసం బావిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడు. కురుమూర్తికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోతు కేకలు వేశాడు. సమీపంలో ఉన్న మరో కాపరి కాపాడేయత్నం చేసినా ఫలితం లేక పోయింది. ఈ విషయం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు సీసీకుంట పోలీసులు, తహసీల్దార్‌కు తెలపడంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని ఫైరింజన్ సిబ్బంది సహకారంతో బయటకు తీసుకొచ్చారు. ప్రమాదం జరిగిన ప్రదేశం వనపర్తి జిల్లా అమరచింత మండలం పరిధిలోకి వస్తుండటంతో అమరచింత పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఉన్న ఒక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

సైబర్ ఉచ్చులోపడి రూ.1.50 లక్షలు స్వాహా

లింగాల: తక్కువ పెట్టుబడితో అధిక లాభం వస్తుందనే ఆశతో యాప్‌లో పెట్టుబడి పెట్టిన మండల పరిధిలోని క్యాంపు రాయవరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మోసపోయిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ నాగరాజు వివరాల ప్రకారం.. ఇటీవల హల్‌చల్ చేసిన డెక్త్లాన్ యాప్‌లో మండలంలోని క్యాంపు రాయవరానికి చెందిన నాగేటి నరసింహ జనవరి 10న రూ.81,200, అదే విధంగా నాగవేణి రూ.69,000 దశల వారీగా పెట్టుబడి పెట్టారు. చివరకు యాప్ కనిపించక పోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే మండల కేంద్రంలో, పలు గ్రామాలకు చెందిన యువకులు, ఉద్యోగులు సైతం యాప్‌లో భారీగా పెట్టుబడులు పెట్టి లక్షలాది రూపాయలు మోసపోయారు. పరిస్థితులు ఈ రకంగా ఉన్నప్పటికీ యాప్‌లకు ఆకర్షితులైన కొందరు మొబైల్స్‌లో కొత్త యాప్‌లు వెతుక్కుంటూ పెట్టుబడులు పెడుతున్నట్లు తెలుస్తోంది.

మూడు ఇళ్లలో చోరీ

● బంగారం, వెండి, నగదు అపహరణ

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు మూడు ఇళ్లలో చొరబడి రూ.31 వేల నగదు, 18 గ్రాముల బంగారం, 36 తులాల వెండి అపహరించినట్లు ఎస్‌ఐ కె.రాణి తెలిపారు. గ్రామ చివరన ఉన్న గొల్ల లక్ష్మి ఇంట్లో రూ.6 వేల నగదు, 5 గ్రాముల బంగారం, 6 తులాల వెండి, గొల్ల ఎల్లమ్మ ఇంట్లో రూ.20 వేల నగదు, 8 గ్రాముల బంగారం, 20 తులాల వెండి, సూగూరి బుడ్డయ్య ఇంట్లో రూ.6 వేల నగదు, 5 గ్రాముల బంగారం, 10తులాల వెండిని ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారని.. కేసు నమోదుచేసి విచారణ చేపడుతున్నట్లు వివరించారు. చోరీ జరిగిన ఇళ్లను సీఐ కృష్ణ, డాగ్‌స్క్వాడ్ బృందం పరిశీలించిందని.. బాధిత కుటుంబీకులు ఉదయం పొలం పనులకెళ్లి మధ్యాహ్నం ఇంటికి రాగా దొంగలు పడినట్లు గుర్తించి సమాచారం ఇచ్చారన్నారు.

రెండు ఆటోలు దగ్ధం

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై నిలిపి ఉన్న రెండు ఆటోలు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు వన్‌టౌన్ సీఐ అప్పయ్య తెలిపారు. వివరాలు.. జిల్లా కేంద్రంలోని పాత పాలమూరుకు చెందిన ఇస్మాయిల్, ఖాజా అనే ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన ఆటోలను మంగళవారం రాత్రి వాళ్ల ఇంటి సమీపంలో రోడ్డుపై పక్కపక్కనే ఉంచారు. రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం నుంచి వైర్ తెగి అర్ధరాత్రి ఆటోల మీద పడటంతో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ఆటోలు దగ్ధమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

2నెలల తర్వాత మృతదేహానికి పోస్టుమార్టం


పోస్టుమార్టం నిర్వహించేందుకు హాజరైన అధికారులు

● మృతురాలి తల్లి ఫిర్యాదుతో..
● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

గోపాల్‌పేట: రెండు నెలల క్రితం ఉరేసుకొని మహిళ మరణించగా.. పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని నాగపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. అధికారులు, స్థానికులు తెలిపిన వివరాలు.. నాగపూర్‌కి చెందిన లక్ష్మి, ఈశ్వర్ భార్యాభర్తలు. పన్నెండేళ్ల క్రితం వీరికి పెళ్లి కాగా ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. డిసెంబరు 6, 2024న రేమొద్దుల లక్ష్మి నాగపూర్ శివారు ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరేసుకుని మరణించింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోస్టుమార్టం చేయకుండా అంత్యక్రియలు నిర్వహించారు. అయితే రెండు నెలల తర్వాత లక్ష్మి తల్లి శాంతమ్మ తన కుమార్తె మరణంపై అనుమానాలు ఉన్నాయని రేవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిబ్రవరి 3న ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి బుధవారం తహసీల్దార్ లక్ష్మీదేవి సమక్షంలో లక్ష్మి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. రేవల్లి ఎస్‌ఐ రాము అందుబాటులో లేకపోవడంతో చిన్నంబావి ఎస్‌ఐ జగన్‌మోహన్ పర్యవేక్షించారు. పోస్టుమార్టం రిపోర్టు రావడానికి సమయం పడుతుందని అధికారులు తెలిపారు.

బీసీలే కాంగ్రెస్‌ను గద్దెదించుతారు

● బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్


మాట్లాడుతున్న ఎం.శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణన లెక్కలు తప్పుల తడకగా ఉన్నాయని, బీసీలు కాంగ్రెస్‌ను గద్దెదించేందుకు సిద్ధమవుతున్నారని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను దెబ్బతీసి ఈడబ్ల్యూఎస్‌ను కాపాడుకునేందుకు బీసీల జనాభాను తక్కువ చేసి చూపించారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సమగ్రంగా వీటిని సమీక్షించి పూర్తిస్థాయిలో గణంకాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. సీఎం సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి కాంగ్రెస్‌ను గద్దె దించేందుకు కార్యాచరణతో గ్రామ గ్రామానా బీసీలకు జరిగిన అన్యాయంపై పోరాటానికి సిద్ధమవుతున్నామన్నారు. బీసీలకు రాజకీయాల్లో దక్కాల్సిన వాటా లభించేవరకు పోరాటం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు బుచ్చన్న, అశ్విని సత్యం, చంద్రమోహన్, ఆశన్న ముదిరాజ్, బి.శేఖర్, విశ్వనాథం, సుకుమార్, గోపాల్, సాయి, రాములునాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలి

● మాల సంఘాల జేఏసీ నాయకుల డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వన్‌మ్యాన్ కమిషన్ ఇచ్చిన రిపోర్టును బుధవారం అంబేడ్కర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కో-చైర్మన్ నర్సింహయ్య, జేఎంఐ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుమార్ల నిరంజన్, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగడ్డ యాదయ్య, జాతీయ మాల మహానాడు రాష్ట్ర కోఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వాములు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని, వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లెన్స్‌కు వ్యతిరేకంగా కులగణన చేయకుండా ఏ విధంగా ఎస్సీ వర్గీకరణ చేస్తారని ప్రశ్నించారు. ఏ గ్రామంలో క్షేత్ర స్థాయిలో ఏ కులాలు వెనుకబాటు గురయ్యాయో సరైన అధ్యయనం చేయకుండా, ఏ కులాల జనాభా ఎంత ఉందో తేల్చకుండా వన్‌మ్యాన్ కమిషన్ ఇచ్చిన రిపోర్టు తప్పుల తడకగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల జనాభాను తక్కువ చూపడం వల్ల ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకోవడానికి మాత్రమే ఎస్సీ వర్గీకరణ చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలను వారి ఉప కులాలుగా వర్గీకరించాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్341, 342ను సవరణ చేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. పంజాబ్, తమిళనాడు, హర్యానాలో ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని జనాభా దామాషా ప్రకారం పెంచి వెనుకబడిన ఉపకులాలకు కేటాయించి వర్గీకరించారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కేంద్రం దేశ వ్యాప్తంగా కులగణన చేసిన తర్వాతనే ఎస్సీ వర్గీకరణ చేయాలని, నేటి జనాభా దామాషా ప్రకారం 15 శాతం నుంచి 20 శాతానికి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ, జేఎంఐ నాయకులు కంచిమి గోపాల్, చెన్నకేశవులు, బ్యాగరి చెన్నకేశవులు, రాములు, శ్రీనివాసులు, వెంకట్రాములు, వెంకటేష్, శ్రీను, బాలరాజు, చిన్న, మహేందర్, ఆనంద్, మున్నయ్య, రాజు, అంజి, తిరుపతయ్య, కిరణ్, కృష్ణ పాల్గొన్నారు.